వడ్డీ మాఫీతో జాక్‌పాట్

- ఇంటి ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీ మాఫీ
- ప్రజలపై భారం తగ్గించిన ప్రభుత్వం
- మున్సిపాలిటీలో సుమారు 700 మందికి రూ.7 కోట్ల మేర లబ్ధి


రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయం

రామచంద్రపురం: పట్టణానికి చెందిన ఒక విద్యా సంస్థ గత కొన్నేళ్లుగా పన్నులు చెల్లించకపోవటంతో మున్సిపాలిటీలో బకాయిలు పేరుకుపోయాయి. దీంతో ప్రభుత్వం కల్పించిన వడ్డీ మాఫీని వినియోగించుకున్నారు. సంస్థ బకాయిలు మొత్తం రూ.13 లక్షలు కట్టేయగా వారికి రూ.25 లక్షలు వడ్డీమాఫీ అయింది. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యకు తెరపడింది. అలాగే వైఎస్సార్ నగర్‌కు చెందిన ఒక ఉద్యోగి గత కొన్నేళ్లుగా పన్నులు చెల్లించకపోవంటంతో ప్రభుత్వం కల్పించిన వడ్డీ మాఫీని ఉపయోగించుకుని బకాయిలు చెల్లించటంతో రూ.25 వేల వడ్డీ మాఫీ అయింది. ఇలా ఎన్నో ఏళ్లుగా పన్ను బకాయిలున్న ఇంటి ఖాళీ స్థల యజమానులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఏళ్లు గడుస్తున్న ఇంటి పన్నులను బకాయిపడి అవి వడ్డీలతో కలసి మూడింతలు పెరగటంతో చెల్లించే ఆర్థిక స్తోమత లేక సతమతవుతున్న ప్రజలను, వివిధ సంస్థలను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే ఈనెల 31లోపు బకాయిలున్న పన్నులు చెల్లిస్తే వారికి పన్నులపై ఉన్న పూర్తి వడ్డీని మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రామచంద్రపురం మున్సిపాలిటీలో సుమారుగా ఏడువందలకు పైగా ఇంటి, ఖాళీ స్థల యజమానులు లబ్ధి పొందనున్నారు. పట్టణంలో సుమారుగా 37 వేలకుపైగా నివాస గృహాలుండగా వారిలో చాలా మంది సకాలంలో పన్నులు చెల్లిస్తున్నారు. రెగ్యులర్‌గా పన్నులు చెల్లించకపోవటంతో గత కొంత కాలంగా మున్సిపాలిటీకి రూ.11 కోట్లకుపైగా బకాయిలున్నాయి. వీటిలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రూ.7 కోట్ల వడ్డీ మాఫీ కానుంది. పట్టణంలో సుమారుగా 700 మందికి పైగా బకాయిలు పేరుకుపోయినట్లు మున్సిపాలిటీ అధికారులు గుర్తించారు. వీరిలో ఆరు నుంచి 7 సంవత్సరాలుగా పన్నులు చెల్లించని ప్రజలు, వివిధ ప్రైవేటు సంస్థలు 56 ఉన్నాయి. నాలుగు నుంచి రెండేళ్లుగా పన్నులు చెల్లించని వారు 650కి పైగా ఉన్నట్లు తెలుస్తుంది. వీరిలో 16 మొండి బకాయిలున్నట్లు గుర్తించారు. ఈ నెల 31 లోపుగా బకాయిలున్న వారు మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తే పూర్తిగా వడ్డీ మాఫీ చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మున్సిపాలిటీలో మొండి బకాయిదారులకు సుమారుగా రూ.7 కోట్లు మేర లబ్ధి చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన వడ్డీ మాఫీ సదుపాయాన్ని ఈనెల 31 లోపు చెల్లించి సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని ఒక ప్రముఖ విద్యా సంస్థ మున్సిపాలిటీకి కొన్నేళ్లుగా పన్ను బకాయి పడింది. ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ మాఫీ పథకం ద్వారా పన్నులు చెల్లిస్తే సదరు సంస్థ నుంచి మున్సిపాలిటీకి రూ.1.90 కోట్లు పన్ను వసూలు కావటమే కాకుండా ఆ సంస్థకు కూడా సుమారు రూ.3.20 కోట్ల వడ్డీ మాఫీ కానుంది.

31లోపు చెల్లించండి



ఖాళీ స్థలాలు, ఇంటి పన్నులు బకాయిదారులకు ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 31 లోపు బకాయి ఉన్న పన్నులను మొత్తం చెల్లిస్తే వడ్డీని మాఫీ చేయడం జరుగుతుంది. మున్సిపాలిటీ పరిధిలోని పన్ను బకాయిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.
– కె శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

మంచి అవకాశం



ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన పన్ను బకాయిదారులకు ప్రభుత్వం ఊరట కల్పించింది. పన్ను బకాయిలను చెల్లించి వడ్డీ మాఫీని పొందటంతో పాటుగా మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నాం. బకాయిలను చెల్లించి ఇకపై సకాలంలో పన్నులను చెల్లించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.
– గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ ఛైర్‌పర్సన్

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

రామచంద్రపురం: పురపాలక సంఘంలో స్వచ్ఛ మహోత్సవం 2023 అవార్డుల ఎంపిక కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పారిశుద్ధ్యం, ఘన వ్యర్థ ప్రత్యేక నిర్వహణలో ప్రతిభ కనబర్చిన మహిళలకు స్వచ్ఛ అవార్డులకు ఎంపిక చేయటం జరుగుతుందని తెలిపారు. వివిధ విభాగాల్లో టాయిలెట్ నిర్వహణ, మురుగునీటి శుద్ధీకరణ, తడి పొడి చెత్త సేకరణ, వేస్ట్ పేపర్లతో టోయికేషన్, చెత్త నుంచి వివిధ కళాకృతులు చేయుట, చెత్త నుంచి సంపద సేంద్రియ ఎరువుల తయారీ సాంకేతికతను వినియోగిస్తూ నూతన ఆవిష్కరణలకు కృషి చేస్తున్న స్వయం ఉపాధి సభ్యులు, ఆసక్తి గల మహిళలు, నాన్‌గెజిటెడ్ ఆర్గనైజేషన్ సభ్యులు దీనికి అర్హులని పేర్కొన్నారు. మార్చి 22 లోపు మున్సిపాలిటీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 5న ఎంపికైన వారికి అవార్డులు అందిస్తామని కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

రేపు కనకదుర్గమ్మ తీర్థం


అర్తమూరులోని కనకదుర్గమ్మ

మండపేట: అర్తమూరులో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి తీర్థమహోత్సవం బుధవారం జరుగనుంది. దీనికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ ఉపసర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి (జంబయ్య) తెలిపారు. గ్రామంలోని కనకదుర్గమ్మ తల్లి అర్తమూరు ప్రజల ఇలవేల్పుగా పూజలందుకుంటోంది. ఏటా కొత్త అమావాస్య రోజున అమ్మవారి జాతర, ఉగాది రోజున తీర్థ మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 1977లో ఆలయాన్ని అభివృద్ధి చేశారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు ఎక్కడున్నా ఆ రోజు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడి చెల్లించుకుంటారు. వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి జాతర, బుధవారం తీర్థం జరుగుతాయని జంబయ్య తెలిపారు.

ద్రాక్షారామంలో ఉగాది పంచాంగ శ్రవణం


రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించుకుని బుధవారం ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు) సోమవారం విలేకరులకు తెలిపారు. ఉగాది పురస్కారాల కార్యక్రమంలో భాగంగా ఉదయం 9 నుంచి పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం, ఇద్దరు సీనియర్ అర్చకులకు, ఒక వేద పండితుడికి సత్కారం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వరలక్ష్మి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. భక్తులు ఉగాది పురస్కార కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

వైభవంగా గోగులమ్మ జాతర


గోగులమ్మకి పుష్పాభిషేకం నిర్వహిస్తున్న మహిళలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరంలో గ్రామ దేవత గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, మండపారాధన, 108 కళశాలతో మహిళలతో క్షీరాభిషేకం, లక్ష పుష్పాభిషేకం, తాడిపట్ట ఊయలతో అమ్మవారికి ఊయల సేవ, సంబరం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ యనమదల మంగాదేవి దంపతులు, ఎంపీటీసీ రెడ్నం వీర వెంకటసత్యనారాయణ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

స్పందించారు.. కల్వర్టు నిర్మించారు..


అగ్రహారంలో నిర్మించిన కల్వర్టు

కపిలేశ్వరపురం: స్థానిక సత్యనారాయణపురం అగ్రహారంలోని డ్రైన్‌పై కల్వర్టు ఛిద్రంకావడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడేవారు. సమస్యను గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ హయాంలో నిర్మితమైన కల్వర్టు నాణ్యతలేమితో ఛిద్రమైంది. ప్రజల అవస్థలు తెలుసుకున్న ఎమ్మెల్సీ తోట వెంటనే స్పందించి సంబంధిత అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కట్టా మురళి చొరవతో రూ.30వేల పంచాయతీ నిధులతో కల్వర్టు నిర్మాణం పూర్తయింది. స్థానికులు ఎమ్మెల్సీ తోటను, అధికారులను అభినందించారు.

భూముల లెక్క పక్కా..

- మండలంలో రీ సర్వే ముమ్మరం
- పనుల్లో నిమగ్నమైన అధికారులు
- తొమ్మిది గ్రామాల్లో పూర్తి


మెర్నిపాడు చేరుకున్న మక్కురాళ్లు వద్ద అశోక్‌కుమార్, రెవెన్యూ, సర్వే సిబ్బంది

మండపేట: గ్రామాల్లో భూముల లెక్క పక్కాగా జరుగుతోంది. భూ వివాదాలకు ప్రభుత్వం చెక్ పెడుతోంది. అధికారులు పారదర్శకతతో పనులు చేపడుతున్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు. భూ రక్ష పథకం రీ సర్వే పనులు మండలంలో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే తొమ్మిది గ్రామాల్లో సర్వే పనులు పూర్తి కాగా గ్రామాల్లో మక్కులు వేసే పనిలో రెవెన్యూ అధికారులు నిమగ్నమవుతున్నారు. అధునాతన పరికరాలతో డ్రోన్ సర్వే చేసి తర్వాత క్షేత్ర స్థాయిలో రెవెన్యూ, సర్వే సిబ్బంది సరిహద్దులు నిర్ణయిస్తున్నారు. దీంతో భూములు లెక్క పక్కా ఉంటుందని, వివాదాలకు తావులేకుండా రైతుల సమక్షంలో సర్వే ప్రక్రియ జరుగుతోంది. స్థలాల విస్తీర్ణాన్ని పక్కాగా నిర్ధారిస్తున్నారు. ఇప్పటికే రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దులు నిర్ణయించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మండలంలో ఇప్పటి వరకు మెర్నిపాడు, వెలగతోడు, పాలతోడు, వై.సీతానగరం తదితర తొమ్మిది గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యిందని తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు తెలిపారు. మిగిలిన మండపేట, ద్వారపూడి శివారు వేములపల్లి, కేశవరం తదితర గ్రామాల్లో రీ సర్వే పనులు జరుగుతున్నాయన్నారు.

మెర్నిపాడులో మక్కులు ప్రారంభం

మెర్నిపాడు గ్రామంలో సరిహద్దు మక్కులు వేసే పనులను సోమవారం రెవెన్యూ, సర్వే సిబ్బంది చేపట్టారు. గ్రామ సర్పంచ్ గారపాటి సౌజన్య, వైఎస్సార్ సీపీ నేత అశోక్ కుమార్ దంపతులు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్ (ఎఫ్ఎంబీ)ల ఆధారంగా భూముల సర్వే కష్టతరమవుతుండడం, రికార్డుల్లో సమగ్రత లేకపోవడం అనేక సమస్యలకు దారి తీస్తున్నాయన్నారు. వాటిలోని లోపాలను ఆసరాగా చేసుకుని కొందరు తప్పుడు రిజిస్ట్రేషన్లకు పాల్పడుతుండడంతో వివాదాలకు జరుగుతున్నాయన్నారు. వీటిని సమగ్రంగా ప్రక్షాళన చేయడం ద్వారా యజమానులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రీసర్వే చేయిస్తున్నారని తెలిపారు. అత్యంత పారదర్శకంగా ఈ ప్రక్రియ జరుగుతోందని, వివాదాలకు తావులేకుండా రైతులు, భూ యజమానులు దగ్గరుండి సర్వే రాళ్లు వేయించుకోవాలని సూచించారు. సర్వేయర్ సంధ్య, వీఆర్‌ఓ రామకృష్ణ, సచివాలయ సర్వేయర్ వర్మ, స్థానికులు పాల్గొన్నారు.

మానవత ఆశ్రమంలో ఉగాది ప్రతిభా పోటీలు

రాయవరం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్లు విశ్వమానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి సోమవారం విలేకరులకు తెలిపారు. లొల్లలో విశ్వమానవత ఆశ్రమంలో ఉగాది రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ ఈ పోటీలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పాటల పోటీలు(దేశభక్తి గీతాలు, సందేశాత్మక పాటలు), గీత శ్లోకాల పోటీలు(12 ఏళ్ల లోపు), టాలెంట్ టెస్ట్(5, 6 తరగతులకు), డ్రాయింగ్, వ్యాసరచన, యోగాసనాల పోటీలు, క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ పోటీలతో పాటుగా వ్యక్తిత్వ వికాస శిక్షణ, ఉగాది పచ్చడి, పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేయనున్నామన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పాఠశాలలు గ్రూప్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 9966673283, 9966673111 నంబర్లకు ఫోన్ చేసి లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.మానవత.ఓఆర్‌జీ సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు


చాకిరేవుమెరకలో డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి తనయుడు నరేన్

కాజులూరు: అభివృద్ధి, సంక్షేమం జగనన్న ప్రభుత్వానికి రెండూ రెండుకళ్లని ఏ ఒక్కదాన్ని ఆయన విస్మరించే ప్రసక్తి లేదని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు నరేన్ అన్నారు. కాజులూరు శివారు చాకిరేవుమెరకలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణానికి మంత్రి వేణు తనయుడు నరేన్ సోమవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజల జీవన ప్రమాణాలను కాపాడేందుకు పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి వచ్చిందని ఆ సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రోడ్లను విస్మరిస్తుందంటూ ప్రతిపక్షాలు అర్థం లేని రాద్ధాంతాలు చేశాయన్నారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతుభరోసా కేంద్రాలకు భవన నిర్మాణాలు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయని పలు గ్రామాల్లో భవనాలు ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కుట్రలు పనుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, సర్పంచ్ దండంగి సరోజని, స్థానిక పీఏసీఎస్ ఛైర్మన్ ఎం.శ్రీను, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, తలాటం వీరన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి గృహసారథులు కృషి చేయాలి


సచివాలయ కన్వీనర్లతో మాట్లాడుతున్న గృహసారథుల కమిటీ పరిశీలకుడు గోవిందరాజు

కాజులూరు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మరింత బలోపేతం కావటానికి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలని రామచంద్రపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పండుల గోవిందరాజు అన్నారు. మండలంలోని శీల, ఒంటితాడి తదితర గ్రామాల గృహసారథుల కమిటీలకు పరిశీలకుడిగా నియమితులైన గోవిందరాజు సోమవారం మండల గ్రామాల్లో పర్యటించి పార్టీలో కొత్తగా నియమితులైన సచివాలయ కన్వీనర్లతో సమావేశాలు ఏర్పాటు చేశారు. శీల గ్రామ సచివాలయంలో సర్పంచ్ కోమలి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ నిలబెట్టుకునేందుకు సీఎం జగన్ అహర్నిశలు కృషి చేస్తున్నారని నవరత్నాల పథకంలో భాగంగా ఇచ్చిన హామీలతో పాటు అదనంగా మరో 50 కొత్త పథకాలు అమలు చేశారన్నారు. కరోనా విపత్కర పరిస్థితులలో దేశం తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమైనప్పటికీ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ఎక్కడా ఆపలేదన్నారు. సచివాలయ కన్వీనర్లు గృహసారథులు, వలంటీర్లతో సమష్టిగా పనిచేసి జగనన్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, ఒంటితాడి సర్పంచ్ నెల్లి బ్రహ్మాజీ, దడాల భీమేశ్వరరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, బత్తుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సుగర్ పరీక్షలు


శిబిరంలో షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణులు

మండపేట: స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అగ్నికుల క్షత్రియుల వీధిలో స్థానికులకు సుగర్ పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు గుండు తాతరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుగరు వ్యాధి వైద్యనిపుణులు ఎస్.సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పరీక్షలు చేసి, ఆ వ్యాధిపై అవగాహన కల్పించారు. క్లబ్ అధ్యక్షుడు తాతరాజు మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు లయన్స్‌క్లబ్ కృషి చేస్తుందన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి 450 మంది స్థానికులకు సుగరు పరీక్షలు నిర్వహించారు. క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ డి.తిరుమలరావు, కోనే వీర్రాజు, చక్కా రాంబాబు, బీవీవీ సత్యనారాయణ, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

దళిత ఎమ్మెల్యేలపై టీడీపీకి చిన్నచూపు తగదు

మండపేట: దళిత ఎమ్మెల్యేలపై టీడీపీకి చిన్నచూపు తగదని అసెంబ్లీ ఘటనపై సోమవారం నియోజకవర్గానికి చెందిన దళిత నేతలు మండిపడ్డారు. మండలంలోని ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైఎస్సార్ సీపీ నేత పలివెల సుధాకర్ మాట్లాడుతూ ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలపై టీడీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తూ ఎస్సీ బీసీలకు సముచిత స్థానం కల్పించడం చూసి ఓర్వలేక చంద్రబాబునాయుడు కుట్ర రాజకీయాలు చేయిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ దళిత ప్రజాప్రతినిధులపై వీధి రౌడీల్లా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేశవరానికి చెందిన తుపాకుల ప్రసన్నకుమార్, యడ్ల రవి మాట్లాడుతూ చట్ట సభలో టీడీపీ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరును బట్టి దళితులపై టీడీపీ వైఖరి స్పష్టమవుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో దళితులు టీడీపీకి తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

సామాజిక తనిఖీ పారదర్శకంగా నిర్వహించాలి


రాయవరంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణ

రాయవరం: గ్రామాల్లో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీని పారదర్శకంగా నిర్వహించాలని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ సోషల్ ఆడిట్ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో సోమవారం ఉపాధి హామీ సోషల్ ఆడిట్ బృందం సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీవో జె.సుధారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ వెంకటరమణ, ఎంపీడీవో డి.శ్రీనివాసు, పీఆర్ ఏఈ రామనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, ఎన్ఆర్‌ఈజీఎస్ జేఈ నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. ఏపీవో సుధారాణి మాట్లాడుతూ 2021–22 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 12 గ్రామాల్లో 2,14,419 పని దినాలు కల్పించామన్నారు. కూలీలకు వేతనాలుగా రూ.5,34,76,585 చెల్లించగా, మెటీరియల్ కాంపోండ్‌గా రూ.4,79,54,960లు ఖర్చు చేసినట్టు ఆమె తెలిపారు.

అనధికార నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

మండపేట: మండపేట కలువపువ్వు సెంటర్‌లో జరుగుతున్న అనధికార నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు కోరారు. ఈ మేరకు సోమవారం అమలాపురంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంటనే స్పందించి డీఆర్‌ఓను విచారణకు ఆదేశించినట్టు కామన తెలిపారు.

క్షయ నివారణ అందరి బాధ్యత


క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రత్నసుధ తదితర వైద్య సిబ్బంది

కె.గంగవరం: క్షయ వ్యాధిని అరికట్టవల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కుందూరు, పీహెచ్‌సీ వైద్యాధికారులు రత్నసుధ అన్నారు. మండలంలోని కోటిపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి ఉన్న వారు క్రమం తప్పకుండా మందులు వాడితే నయం అవుతుందన్నారు. క్షయ వ్యాధి ఉన్న రోగికి పౌష్టికాహారం నిమిత్తం నెలకు రూ.500 చొప్పున ఆరు నెలలకు రూ.3 వేలు వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్నారన్నారు. ప్రైవేటు వైద్యం చేసే వారు కూడా క్షయ వ్యాధి ఉన్న రోగుల వివరాలను ప్రభుత్వ ఆసుపత్రికి తెలియజేయాలని కోరారు. 2025 నాటికి దేశంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే ప్రభుత్వ లక్ష్యం విజయవంతమయ్యే వరకూ ప్రతి ఒక్కరి కృషి ఉండాలని విద్యార్థులతో కలసి ప్రతిజ్ఞ చేశారు. టీబీ సూపరింటెండెంట్ కేఎస్‌వీ రమణ, వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంట తెగుళ్లపై రైతులు శ్రద్ధ వహించాలి

కాజులూరు: పంట తెగుళ్లపై రైతులు తొలిదశ నుంచి తగిన శ్రద్ధ వహించాలని ఏఓ వి.అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని చేదువాడ, కాజులూరు తదితర గ్రామాల్లో ఏఓ పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. వరిసాగులో నారుమడి దశ నుంచే మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రస్తుతం మండల గ్రామాల్లో పంట దుబ్బు కట్టే దశ నుంచి చిరుపొట్ట దశలో ఉందని పంటపై అక్కడక్కడా హిస్స, కాండంతొలుచు పురుగు లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. నారుమడుల్లో వరి ఆకు సుతల్లో హిస్స, కాండం తొలుచు పురుగుగుడ్లు పొదగి ఉంటాయని నాటే ముందు వరిమొక్క సుతలను తుంచి నాటినట్లయితే ఇవి ప్రధాన పంటకు సోకకుండా జాగ్రత్త తీసుకున్నట్లయ్యేదన్నారు. రైతులు పంటలపై తెగుళ్ల లక్షణాలను గమనించిన వెంటనే సమీపంలోని ఆర్‌బీకేలలో సంప్రదించి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం


అంగర సచివాలయంలో ఆధార్ వివరాలు నమోదు చేస్తున్న దొరబాబు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, కోరుమిల్లి సచివాలయాల్లో సోమవారం ఆధార్ నవీకరణ శిబిరాలను నిర్వహించారు. ఆయా శిబిరాల్లో డిజిటల్ అసిస్టెంట్లు దొరబాబు, మల్లేశ్వరరావు నూతనంగా ఆధార్ కార్డులతో పాటు అడ్రస్, వేలి ముద్రలు తదితర మార్పులను చేశారు. ఆయా శిబిరాల్లో 25 చొప్పున 50 మంది తమ ఆధార్ కార్డులను నవీకరించుకున్నారు. మంగళవారం అవే కేంద్రాల్లోనూ 27 నుంచి 29 వరకూ వడ్లమూరు, వాకతిప్పలలోనూ నవీకరణ శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు.

40 మందికి కంటి పరీక్షలు


వైద్య పరీక్ష చేస్తున్న కోటేశ్వరరావు

కపిలేశ్వరపురం: స్థానిక సచివాలయం–2 పరిధిలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా 40 మందికి ఉచితంగా కంటి పరీక్షలను చేశారు. పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ డి.కోటేశ్వరరావు పరీక్షలు చేసి 30 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. నలుగురికి శస్త్ర చికిత్సలు చేయించాలని నిర్ణయించారు. శిబిరంలో సచివాలయ ఆరోగ్య కార్యకర్త శిరోమణి,, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు సేవలందించారు.

నోటి సంబంధిత సమస్యలపై అవగాహన

కపిలేశ్వరపురం: నోటి సంబంధిత ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని అంగర పీహెచ్‌సీ ప్రతినిధులన్నారు. ఓరల్ హెల్త్ డేను పురస్కరించుకుని అంగర పీహెచ్‌సీ వైద్యులు పి.రత్నకుమారి, జె.అనూజ ప్రియాంకల పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య సిబ్బంది పలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పడమర ఖండ్రిక పోశమ్మ ఆలయ సమీపంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలలో వైద్య ఆరోగ్య కార్యకర్తలు వెన్నేటి వెంకటేశ్వరరావు, దుర్గ మాట్లాడుతూ నోటి సంబంధిత ఆరోగ్య సమస్యలను వివరించారు. నోటి పరిశుభ్రత, పౌష్టికాహార ప్రాధాన్యతలపై అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయుడు పి.సురేంద్ర మాట్లాడుతూ చదువుపై ఆరోగ్య పరిస్థితుల ప్రభావాలపై మాట్లాడారు.

పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రమణ

కె.గంగవరం: రానున్న పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ సూచించారు. మండలంలోని దంగేరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో వారు సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం సీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అమ్మఒడితో పాటు పలు పథకాలు అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏప్రిల్ నెలలో జరిగే పదోతరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

నూకాంబిక జాతరలో ఆకట్టుకున్న విద్యుద్దీపాలంకరణ

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. మహిళలు తమ చిన్నారులతో కాగడాలు వెలిగించి బాలరిష్టాలను నివారించి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన వారకల్లు, తుళ్లబిళ్లను తల్లిదండ్రులు తమ చిన్నారులతో స్వీకరింపజేశారు. వర్షంలో ఇబ్బందులు ఎదురైనా సుదూర, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల తాకిడికి ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆర్‌డబ్ల్యూఎస్, దేవదాయశాఖ శాఖలు నీరు, చంటి పిల్లలకు ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి పాలు అందించారు. పంచాయతీరాజ్ శాఖ పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటి చెత్తను అప్పుడు బయటకు తరలిస్తున్నారు. ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ పంపిణీలో సమస్యలు తలెత్తకుండా నిరంతరాయంగా సరఫరా చేశారు. పెదపళ్ల పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్యసేవలను అందించారు. చిన్నారులకు, యువతకు వినోదాన్ని పంచే జెయింట్‌వీల్స్, కొలంబస్, రంగులరాట్నం తదితర వినోద సాధనాలను తీర్థంలో నెలకొల్పడంతో సందడి నెలకొంది. అమ్మవారి జాతర సందర్భంగా చర్మ వాయిద్య కళాకారులు శబ్దాలకు అనుగుణంగా ఆలయ అర్చకులు చేపట్టిన గరగ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బ్యాండు సన్నాయి వాయిద్య మేళాలు, విచిత్ర వేషధారణలు, కోయ నృత్యాలు, శక్తి వేషధారణ విశేషంగా ఆకట్టుకున్నాయి.